క్లుప్తంగా

రంగా జీవితం నేటితరాలకు ఆదర్శం



నగరంపాలెం: రేపల్లె ప్రధాన రహదారిలో వంగవీటి మోహనరంగా 77వ జయంతి వేడుకలు గురువారం జరిగాయి. కమతం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కమతం సాంబశివరావు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ రంగా జీవితం నేటి తరాలకు ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో రంగా అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫార్మా-డీ పరీక్ష ఫలితాల్లో హిందూ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏఎన్‌యూ బుధవారం విడుదల చేసిన ఫార్మా-డీ నాలుగు, ఐదో సంవత్సర పరీక్ష ఫలితాల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో నాగభూషణం మాట్లాడుతూ ఫార్మా డీ నాలుగో సంవత్సర పరీక్షలకు హాజరైన 29 మంది విద్యార్థుల్లో 10 మంది డిస్టింక్షన్, 16 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అదే విధంగా ఐదో సంవత్సర పరీక్షలు రాసిన 24 మంది విద్యార్థుల్లో 22 మంది డిస్టింక్షన్, ఒకరు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు వివరించారు. ఫార్మా-డీ నాలుగో సంవత్సరం విద్యార్థినులు గుంటూరు వెంకట శ్రీలేఖ 81.7 శాతం మార్కులతో ప్రథమస్థానం, బంధంరావూరి నాగస్నేహ 81.6 శాతం మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. ఫార్మా-డీ ఐదో సంవత్సరం విద్యార్థినులు బలుసుపాటి కృష్ణకుమారి 89.2 శాతం, సూరా శ్రీవర్ధిని 85.2 శాతంతో ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచారని వివరించారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూధనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫార్మా-డీ డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, విభాగాధిపతి ఎస్.హేమకుమారి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో గురువారం మాసశివరాత్రి సందర్భంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులచే తొమ్మిదిమంది వేద పండితులు గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీ గణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించి, పూర్ణాహుతి చేశారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి రంగా



గుంటూరు మెడికల్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా ఆశయ సాధన కోసం అందరు కృషిచేయాలని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. గుంటూరు కొత్తపేట రంగా బొమ్మ సెంటర్‌లో రంగా జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు బీజేపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్‌లు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సమత, టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, డెప్యూటీ మేయర్ షేక్ సజిల, పోతురాజు చంద్రశేఖర్, ఆళ్ల నాని తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం.. రూ.10లక్షలు స్వాహా

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొరిటెపాడుకు చెందిన హేమంత్‌కుమార్ టెలిగ్రామ్ యాప్‌లో టాస్క్ ఆపరేట్ చేశాడు. అందులో టాస్క్‌పెట్టి పూర్తి చేస్తే డబ్బులు ఇస్తామని చెబుతారు. టాస్క్ నిర్వాహకులు చెప్పిన విధంగా పలుమార్లుగా రూ. 10 లక్షలు చెల్లించాడు. మోసపోయినట్లు గుర్తించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు
- ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్య్ర సాధన కోసం చిరుప్రాయంలోనే ప్రాణాలర్పించిన అల్లూరి ఆశయాల బాటలో సమాజంలోని ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. గురువారం మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా నాజ్ సెంటర్లోని అల్లూరి కాంస్య విగ్రహానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ బ్రిటిష్ వారిని ఎదురించడం ద్వారా స్వాతంత్య్ర ఉద్యమాన్ని పతాకస్థాయికి తీసుకువెళ్లిన అల్లూరి దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా వదిలారని కొనియాడారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగుజాతి ముద్దుబిడ్డగా, బ్రిటిష్ తుపాకీకి గుండెను ఎదురుగా ఉంచి అమరుడైన అల్లూరి దేశ స్వాతంత్య్రం కోసం చేసిన కృషి మరువలేనిదన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితమే కోస్తాంధ్ర జిల్లాల్లో మొట్టమొదటిగా అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని గుంటూరు నగరంలో నెలకొల్పారని, విగ్రహ పునరుద్ధరణలో భాగంగా దానిని కాంస్య విగ్రహంగా మార్చామని చెప్పారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి, పీఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

ఏఎన్‌యూలో...

ఏఎన్‌యూ: విప్లవ వీరుడు, మన్యం దొర అల్లూరి సీతారామరాజుకు గురువారం విశ్వవిద్యాలయంలో ఘన నివాళులు అర్పించారు. విశ్వవిద్యాలయ తాత్కాలిక రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్య కోలే, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య స్వరూపరాణి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య గంగాధరరావు, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాసరెడ్డి, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, తదితరులు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్యసాధనకు అల్లూరి చేసిన కృషిని నేటి తరం విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించి భారతదేశ కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాప్తంగా ఇనుమడింప చేయాలని కోరారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో...

లక్ష్మీపురం: ఆంధ్రుల, ధైర్య సాహసాలను తెలివితేటలను భారత జాతికి తెలియజేసిన వీరకిశోరం అల్లూరి సీతారామరాజు తరతరాలకు ధృవ తారగా నిలిచిపోతారని మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్. మూర్తి, అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘననివాళులర్పించారు. విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడుతూ ఇరవై ఏళ్ల వయస్సులోనే బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించిన అల్లూరి సీతారామరాజుని తెలుగు వారెప్పుడు మర్చిపోరన్నారు. ఎల్.మురళీకృష్ణ, సాయిరాం, ఆర్.వి.సింగరయ్య, ఇంధుశేఖర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



ఏఎన్‌యూలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, విద్యార్థులు

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం పునరుద్ధరించాలి

గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు కేతావతు పాండునాయక్

గుంటూరు ఎడ్యుకేషన్: బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని పునరుద్ధరిస్తామని యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీమేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే తగు చర్యలు చేపట్టాలని గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు కేతావతు పాండునాయక్ డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోని రైల్వే ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో పాండునాయక్ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో భాగంగా కారంపూడిలో నిర్వహించిన గిరిజనుల ముఖాముఖిలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీంను తిరిగి ప్రారంభిస్తామని లోకేష్ హామీ ఇచ్చారని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుత విద్యాసంవత్సరంలో పథకాన్ని పునఃప్రారంభించి, గిరిజన విద్యార్థులకు తోడ్పాటు అందించాలని కోరారు. తక్షణమే తగు చర్యలు తీసుకుని, గిరిజన విద్యార్థులు విద్యాసంవత్సరం నష్టపోకుండా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ నాయకుడు అయ్యస్వామి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాండునాయక్

అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి

డీఈఓ, ఆర్జేడీలకు ఏపీటీఎఫ్ వినతి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు డిమాండ్ చేశారు. ఈమేరకు ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా నాయకులు గురువారం డీఈఓ పి.శైలజ, ఆర్జేడీ బి.లింగేశ్వర రెడ్డిని కలిసి ఉపాధ్యాయ సమస్యలతో కూడిన వినతి పత్రాలు సమర్పించారు. బసవ లింగారావు మాట్లాడుతూ 2023, 2024 సంవత్సరాల్లో వేసవి సెలవుల్లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు, దూరవిద్య టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణ, సార్వత్రిక ఎన్నికల విధులతో పాటు మనబడి నాడు-నేడు విధులు నిర్వహించిన ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులకు సంపాదిత సెలవులు నిబంధనలు మేరకు ప్రిజర్వ్ చేసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. 1995 నుంచి 2018 వరకు నిర్వహించిన వివిధ డీఎస్సీల అప్డేట్ సీనియారిటీ జాబితాలు ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంచాలని కోరారు. మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకుని, సర్వీస్ రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్ జరగని ఉపాధ్యాయులకు ఆయా కేడర్లలో సర్వీస్ రెగ్యులరైజేషన్ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయుల నెలవారీ పదోన్నతులను పునరుద్ధరించి ఖాళీలను భర్తీ చేయాలన్నారు. విద్యాశాఖ కార్యాలయంలో సిటిజన్ జాబ్ చార్ట్ అమలు చేయాలని పేర్కొన్నారు. అదే విధంగా పాఠశాలలు ప్రారంభమై 20 రోజులవుతున్నా ఇంకా విద్యార్థులకు కొన్ని సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు అందలేదన్నారు. వెంటనే నూతన పాఠ్య పుస్తకాలు అందించాలని కోరారు. డీఈఓ, ఆర్జేడీలను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా ఉపాధ్యక్షులు పి.నాగశివన్నారాయణ, పి.లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శులు ఎస్.ఎస్.ఎస్.మూర్తి, పి.శ్రీను, జి.దాస్, జిల్లా కౌన్సిలర్లు బాలరాజు, శివరామకృష్ణ, నాగేశ్వరరావు, నరసింహారావు, భాస్కర్, సుబ్బారావు, మూర్తి తదితరులు ఉన్నారు.



డీఈఓ శైలజకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఎన్ఎంఎంఎస్‌కు 'జలగం రామారావు' విద్యార్థులు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం అందించే జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలకు (ఎన్ఎంఎంఎస్) ఎంపికైన జలగం రామారావు నగర పాలకసంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుధారాణి అభినందించారు. గురువారం కొత్తపేటలోని పాఠశాలలో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షకు పాఠశాల నుంచి హాజరైన 60 మంది విద్యార్థుల్లో 15 మంది ఎంపిక కావడం ద్వారా నగరపాలకసంస్థ పాఠశాల సత్తా నిరూపించారని చెప్పారు. 8వ తరగతిలో ఉండగా పరీక్ష రాసి ఎంపికైన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం మూడేళ్లపాటు ప్రతి నెలా రూ.వెయ్యి చొప్పున ఉపకార వేతనం అందిస్తుందని తెలిపారు. అత్యధిక సంఖ్యలో ఎంపిక కావడం ద్వారా తమ పాఠశాల జిల్లాస్థాయిలో ప్రగతి సాధించిందని అన్నారు. పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న బషీర్ మాస్టారు విద్యార్థులకు ఇచ్చిన ప్రోత్సాహం, వారిని పరీక్షకు సన్నద్ధం చేయడం ద్వారా అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ఎంపికయ్యారని అన్నారు. కార్పొరేట్ పాఠశాలలతో పోటీ పడి తమ విద్యార్థులు ప్రతిభ చాటారని అభినందించారు. ఉపాధ్యాయులు మాదాసు హరీష్, ప్రసన్న లక్ష్మి, అనూష, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులతో హెచ్ఎం సుధారాణి, ఉపాధ్యాయులు

14న 'ఏ షామ్ మస్తాని-15'

నగరంపాలెం: ఈనెల 14న గుంటూరు రాజాగారితోటలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సమర్పణలో గీతాంజలి ఆర్కెస్ట్రా గాయనీ, గాయకులతో ఏ షామ్ మస్తాని-15 నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్రరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత హిందీ సినీ గీతాలతో సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందని, పాడుతా తీయగా గాయని శ్రీలలిత హాజరవుతారని అన్నారు. ఉచిత పాస్‌ల కోసం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలోగానీ, బ్రాడీపేట గీతాంజలి ఆర్కెస్ట్రా కార్యాలయంలోగానీ 9848365751 నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్టు


గుంటూరు ఈస్ట్: బైకులు చోరీ చేసిన నిందితుడిని కొత్తపేట పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌హెచ్ఓ అన్వర్ బాషా తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లాకు చెందిన ఎస్.విద్యాధర్ గుంటూరు నగరంలో పలుచోట్ల 8 ద్విచక్ర వాహనాలు చోరీ చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు విద్యాధర్‌ను గురువారం అరెస్టు చేసి, అతని వద్దనుంచి 8 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

- అదేవిధంగా సికింద్రాబాదుకు చెందిన రమావత్ రవి గుంటూరు నగరంలో పలు చోరీలకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు గురువారం అరెస్టు చేసి అతని వద్దనుంచి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు.

ట్యూమర్లని వదిలేయొద్దు!

ఒకప్పుడు మస్తిష్కం (బ్రెయిన్)లో ఏం జరుగుతుందో, అసలు అందులో ఏముంటుందో తెలుసుకోలేని స్థితి. ఇవాళ పరిస్థితి అలా లేదు. అందులోని అణువణువునీ ఎంఆర్ఐ గుర్తిస్తోంది. అందునా, అందులో పుట్టుకు వచ్చే ట్యూమర్లను ఇట్టే పసిగట్టేస్తోంది. ఇక వాటిని ఏఏ మందులు వేసి నయం చేయాలో, ఎలా తొలగించాలో అన్న విషయమై వైద్యశాస్త్రం చాలా పరిణతి చెందింది. అయితే ఈ ట్యూమర్లను ఊరికే వదిలేయడం సరి కాదంటోంది వైద్యరంగం. ఏం చేస్తే వాటిని అరికట్టవచ్చో ఇదిగో.. ఇలా వివరంగా తెలియచేస్తోంది..

- బ్రెయిన్ ట్యూమర్లను అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకమే
- ఆధునిక ఆపరేషన్లతో తొలగింపు
- పిల్లలు, పెద్దవాళ్లలోనూ గుర్తింపు!



బ్రెయిన్ ట్యూమర్స్ పోస్టర్లు

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన రాజేష్ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఒకరోజు విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆఫీస్‌లో సడన్‌గా కిందకు పడిపోయాడు. మనిషిలో ఎలాంటి చలనం లేకుండా ఉండే సరికి తోటి ఉద్యోగులు తక్షణమే అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్య పరీక్షలు చేసి తలలో ట్యూమర్ ఉందని నిర్ధారించారు. ఆపరేషన్ చేయని పక్షంలో ప్రాణాలకే ప్రమాదమని న్యూరోసర్జన్లు తెలియజేయటంతో కుటుంబ సభ్యులు ఆపరేషన్ చేయించారు. కొంతకాలం విశ్రాంతి తీసుకున్న అనంతరం నేడు రాజేష్ తన ఉద్యోగానికి వెళ్తున్నాడు. ఆధునిక జీవనశైలి వల్ల బ్రెయిన్ ట్యూమర్లు పెరిగిపోవటంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రెయిన్ ట్యూ మర్లను సకాలంలో గుర్తించకపోవటంతో అవి ప్రాణాంతకంగా మారుతున్నాయి. పెద్దవారితో పాటుగా చిన్నపిల్లల్లోనూ బ్రెయిన్ ట్యూమర్స్ కనిపిస్తూ ఉండటంతో ప్రతి ఒక్కరు వ్యాధి పట్ల అవగాహన కల్గి ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ప్రతిరోజూ 30కి పైగా సర్జరీలు

జిల్లాలో బ్రెయిన్ ట్యూమర్ సమస్యలతో బాధపడు తూ చికిత్స కోసం ప్రతిరోజూ సుమారు 500 మందికి పైగా బాధితులు న్యూరోసర్జరీ వైద్య నిపుణులు, న్యూరాలజిస్టులను సంప్రదిస్తున్నట్లు వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. ప్రతిరోజూ జిల్లాలో 30 మందికి బ్రెయిన్ ట్యూమర్ సర్జరీలు జరుగుతున్నాయని వెల్లడించారు. గుంటూరు జీజీహెచ్‌లో వారంలో ఇరువురికి బ్రెయిన్ ట్యూమర్ సర్జరీలు చేస్తున్నారు.

లక్షణాలు ఇలా...

బ్రెయిన్‌లో సర్వసాధారణంగా సెల్స్ చనిపోయి కొత్తవి పుట్టుకొస్తుంటాయి. కొన్ని సమయాల్లో కణాలు చనిపోకుండానే కొత్తకణాలు పుట్టుకొచ్చి కొత్తగా వచ్చిన కణాలు ట్యూమర్‌గా (గడ్డ) మారతాయి. కొన్ని గడ్డలు క్యాన్సర్‌గా మారి ప్రాణాలు తీస్తాయి. కొన్ని ప్రమాదకరమైనవి కావు. ఆపరేషన్ చేసి తొలగించవచ్చు. బ్రెయిన్ ట్యూమర్ ఉన్నవారిలో విపరీతమైన తలనొప్పి, వాంతులు అవ్వగానే తలనొప్పి తగ్గటం జరుగుతుంది. ఎక్కువగా ఉదయం వేళల్లో ఈ సమస్య కనిపిస్తుంది. మాట్లాడటం కష్టంగా ఉంటుంది. వినికిడి సమస్య, చూపు మసకబారటం, నడవటం కష్టంగా ఉండటం తదితర లక్షణాలు ఉంటాయి. బ్రెయిన్ ట్యూమర్ సైజును బట్టి, అది బ్రెయిన్‌లో ఏర్పడిన ప్రదేశం బట్టి, ట్యూమర్ రకాన్ని బట్టి లక్షణాలు ఒక్కో మనిషిలో ఒక్కో రకంలా కనిపిస్తాయి.

బ్రెయిన్ ట్యూమర్‌కు కారణాలు

బ్రెయిన్ ట్యూమర్‌లు జన్యుపరలోపాల వల్ల, వంశపారంపర్యంగా వస్తాయి. బ్రెయిన్‌కు రేడియేషన్ సోకటం వల్ల, సెల్‌ఫోన్ విపరీతంగా వాడటం వల్ల రేడియేషన్ సోకి మెదడులో గడ్డ వచ్చే అవకాశాలు చాలా మెండుగా ఉన్నాయి. పిల్లలు, పెద్దవారు అనే తేడా లేకుండా అన్ని వయస్సుల వారికి బ్రెయిన్ ట్యూమర్‌లు వస్తాయి.

ఆధునిక సర్జరీలతో మెరుగైన జీవితం



బ్రెయిన్ ట్యూమర్స్‌లో నూటికి 10 శాతం మాత్రమే ప్రాణాంతకమైనవి. జనాభాలో ఒక శాతం మంది బ్రెయిన్ ట్యూమర్స్‌తో బాధపడుతున్నారు. ప్రజలకు బ్రెయిన్ ట్యూమర్స్‌పై అపోహలు చాలా ఉన్నాయి. అవగాహన చాలా తక్కువగా ఉంది. న్యూరో నేవిగేషన్, ఆల్ట్రా మైక్రోస్కోప్ లాంటి ఆధునిక ఆపరేషన్లతో బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ చేయించుకున్న వారు గతంలో కంటే చాలా మెరుగైన జీవితాన్ని గడపవచ్చు. ఈ ఆధునిక వైద్యం ద్వారా నూటికి 90 శాతం రోగికి మంచి జీవితాన్ని ప్రసాదించవచ్చు

–డాక్టర్ బీజాపూరి చంద్రశేఖర్, న్యూరోసర్జన్, గుంటూరు.

ట్యూమర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చు



ప్రాథమిక దశలోనే తలలో గడ్డలను గుర్తిస్తే ఆపరేషన్లతో పనిలేకుండా మందులతో పూర్తిగా నయం చేయవచ్చు. బ్రెయిన్ ట్యూమర్లను ప్రాథమిక దశలోనే గుర్తించే ఆధునిక వైద్య పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నాయి. అన్ని ట్యూమర్‌లకు ఆపరేషన్లు చేయాల్సిన పనిలేదు. రేడియేషన్ థెరపీ, కీమోథెరపీ, స్టెరాయిడ్స్, యాంటీసీజర్ మెడికేషన్ వైద్య విధానాల ద్వారా గడ్డలను నయం చేయవచ్చు.

–డాక్టర్ చక్కా శివరామకృష్ణ, న్యూరాలజిస్ట్, గుంటూరు.

కౌలు రైతు గుర్తింపు కార్డులతో మేలు

తెనాలిరూరల్: భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసే వారికి కౌలు రైతు గుర్తింపు కార్డులతో ఎంతో మేలు చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్ సాగర్ తెలిపారు. మండలంలోని బుర్రిపాలెం, తేలప్రోలు గ్రామాల్లో సాగుదారులకు కౌలురైతు గుర్తింపు కార్డులపై గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. కౌలు రైతు గుర్తింపు కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను కౌలు రైతులకు వివరించారు. వీఆర్‌వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

వైద్యాధికారి వేధింపులు అరికట్టాలని వినతి

గుంటూరు మెడికల్: ముస్నంగి పీహెచ్‌సీలో పని చేస్తున్న సచివాలయం హెల్త్ సెక్రటరీలపై పీహెచ్‌సీ వైద్యాధికారి వేధింపులను అరికట్టాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. గర్భిణులను కాన్పుకు ఆసుపత్రికి తీసుకు వెళ్లినప్పుడు గర్భిణితోపాటు ఏఎన్ఎంలు కూడా ఆసుపత్రిలోనే ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ఆదేశించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అందుకు నిరాకరించిన ఏఎన్ఎంలపై వేధింపులకు పాల్పడుతున్నారని, వేధింపులు భరించలేక ఆశాజ్యోతి అనే హెల్త్ సెక్రటరీ ఆసుపత్రి పాలయ్యారని పేర్కొన్నారు. వైద్యాధికారి ఏఎన్ఎంలను దుర్భాషలాడుతున్నారని, రాత్రి పొద్దుపోయే వరకు సమావేశాల పేరుతో పీహెచ్‌సీలోనే ఉంచుతున్నారని, సెలవులు ఇతర అవసరాల కోసం వైద్యాధికారి వద్దకు వెళ్లినప్పుడు గంటల తరబడి పీహెచ్‌సీలో నిలబెడుతున్నారని ఏఎన్ఎంలు వాపోయారు. దీనిపై స్పందించిన డాక్టర్ కొర్రా విజయలక్ష్మి హై రిస్క్ కేసులు ఉన్నప్పుడు సూపర్‌వైజర్లు, ఆ పై స్థాయి సిబ్బంది మాత్రమే ఆసుపత్రికి వెళ్లాలని చెప్పారు. సాధారణ కేసులకు ఏఎన్ఎంలు ఆసుపత్రికి వెళ్లి వారిని ఆసుపత్రిలో చేర్చాలని, ఆసుపత్రిలో ఉండాల్సిన అవసరం లేదన్నారు. ఇందుకు భిన్నంగా వైద్యాధికారులు ఆదేశాలిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అలాంటివారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డీఎంహెచ్ఓను కలిసిన వారిలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, ఏపీ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.అన్నమ్మ, యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ నాయకులు జె.శ్యామ్, ముస్నంగి పీహెచ్‌సీ కమిటీ నాయకులు జె.హేమలత, డి.అనిత ప్రియదర్శిని, పి.కుసుమ తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేసిన సీఐటీయూ నేతలు

విద్యాసంస్థల బంద్ విజయవంతం



లక్ష్మీపురం: దేశవ్యాప్తంగా నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని, జీఓ నెంబర్ 77ను రద్దు చేయాలి, పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నైట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. విద్యార్థులు, విద్యావిధానంపై కేంద్ర విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా జరిగిన బంద్‌లో భాగంగా గురువారం జిల్లాలో బంద్ నిర్వహించారు. స్థానిక హిందూ కళాశాల సెంటర్ వద్ద విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు, స్కూల్స్ ముందుగానే సెలవు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో, పట్టణాల్లో ప్రతి కళాశాలలో, ప్రతి స్కూల్‌లో బంద్ సంపూర్ణంగా జరిగిందన్నారు. ఎస్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమల రావు మాట్లాడుతూ వన్ నేషన్ – వన్ ఎగ్జామ్ ముసుగులో మొత్తం పరీక్ష వ్యవస్థ కుప్పకూలిందన్నారు. కేంద్రం తప్పుడు విధానాలతో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. బంద్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, బాలికల జిల్లా కన్వీనర్ బి.సుచరిత, జిల్లా నాయకులు యశ్వంత్ ఆరిఫా, భగత్ సింగ్, నగర్ నాయకులు షంషీర్, ఆరిఫ్, రోహిత్, హర్ష, బందెల నాసర్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

తెనాలిఅర్బన్: ట్రైబల్స్ మినిస్ట్రీస్ అధ్యక్షురాలు రావూరి అంజలి ఆధ్వర్యంలో యడ్లలింగయ్య కాలనీలోని గిరిజనులకు గురువారం బియ్యం పంపిణీ చేశారు. ఇంటూరి విజయభాస్కర్, దోనేపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.